క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



చిట్యాల: మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా బందెల ప్రేమ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన గంగాధారి రాజు బదిలీపై హనుమకొండకు వెళ్లారు.

సన్మానం



చిట్యాల: మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జ్‌గా ఎనిమిది సంవత్సరాలు పని చేసిన గంగధారి రాజు సోమవారం బదిలీ అయ్యారు. దీంతో హమాలీ కార్మికులు ఆయనకు శాలువతో సన్మానం చేసి వీడ్కోలు పలికారు. సరిగోమ్ముల సురేష్, బండారి మధుకర్, కట్కూరి కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు..



భూపాలపల్లి రూరల్: బీజేపీ జిల్లా కార్యవర్గంలో ఇటీవల పదవులు పొందిన నాయకులను స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, సోషల్ మీడియా కన్వీనర్ ఊరటి మునిందర్, రూరల్ మండల అధ్యక్షుడు పులి గుజ్జరాజులను ఘనంగా సన్మానించారు.

నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీ ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో నేడు(మంగళవారం) దేవాలయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఈఓ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికులు మట్టి విగ్రహాలను తీసుకువెళ్లాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించారు. ఈ మేరకు శాయంపేట మండలం జోగయ్యపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పల్లె వేన కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

టీషర్టుల పంపిణీ



చిట్యాల: మండలంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల పదవి విరమణ పొందిన గోవింద సత్యనారాయణ సోమవారం విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మల్హర్: గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు మండలంలోని కొయ్యూరు గ్రామంలో సోమవారం కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్లో నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేశారు. 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోని సరోజనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజన్ కుమార్ తెలిపారు. అక్రమంగా గుడుంబా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాల సందర్శన

కాటారం: మహాముత్తారం మండలం శ్రీపాద కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ డిమాండ్ చేశారు. పాఠశాలను సోమవారం పూర్ణచందర్ సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలకు ప్రత్యేకంగా తాగునీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచి ఉండడంతో విద్యార్థులు రోగాల బారినపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.

కలగానే సబ్ పోస్టాఫీస్

- బ్రాంచ్ ఆఫీస్‌గానే కొనసాగింపు
- ప్రజలకు అందని తపాలా సేవలు

టేకుమట్ల: సుమారు 70 సంవత్సరాల నుంచి తపాలా శాఖ నుంచి బ్రాంచ్ ఆఫీస్‌గా టేకుమట్లలో కొనసాగుతోంది. నాటి నుంచి నేటి వరకు సబ్ పోస్టాఫీస్‌గా మార్చే ఆలోచన అధికారులకు రావడం లేదు. మండల కేంద్రంలో పోస్టాఫీస్ ఏర్పాటు అవుతుందనే ప్రజల కల కలగానే మిగిలిపోతోంది. టేకుమట్ల బ్రాంచ్ ఆఫీస్ పరిధిలో టేకుమట్లతో పాటు, రామకృష్ణాపూర్ (టి), అంకుషాపూర్, సోమనపల్లి ఉండగా, మండలంలోని పంగిడిపల్లి, వెలిశాల, రామకృష్ణాపూర్(వి), గరిమిళ్లపల్లి, గిద్దె ముత్తారం, వెంకట్రావుపల్లి రాఘవరెడ్డి పేట, కుందనపల్లి, ఎంపేడు, దుబ్యాల గ్రామాల తపాలా సేవలు టేకుమట్ల బ్రాంచ్ ఆఫీస్ నుంచి చిట్యాల పోస్ట్ ఆఫీస్‌కు కొనసాగుతున్నాయి. తపాలా సేవలను మండల ప్రజలు వినియోగించుకునేందుకు సరైన సౌకర్యాలు లేవు. టేకుమట్ల బ్రాంచ్ ఆఫీస్‌లో ఖాతా మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. లావాదేవీలు మాత్రం చిట్యాల పోస్టాఫీస్‌లోనే నిర్వహించుకోవాల్సి పరిస్థితి. అదే మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేస్తే తపాలా శాఖలో అందిస్తున్న సేవలు అన్నింటిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుంటారు.



టేకుమట్లలోని పోస్ట్ బ్రాంచ్ ఆఫీస్

పని భారం పెరిగింది



మండల కేంద్రంలో దశాబ్దాలుగా బ్రాంచ్ ఆఫీస్ కొనసాగుతోంది. మండల కేంద్రంలోని బ్రాంచ్ ఆఫీస్‌లో ఒక్కడినే పనిచేయడం వల్ల ఉత్తరాలను పంచడం, పెన్షన్లు, ఉపాధిహామీ నగదు, కార్యాలయ నిర్వహణ తదితర పనులతో ఇబ్బందిగా ఉంది. మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు తపాలా సేవలు అందుబాటులోకి వస్తాయి. దాంతోపాటు సిబ్బంది పెరుగుతారు.

- భాస్కర్, బీపీఎం, బ్రాంచ్ ఆఫీస్ టేకుమట్ల

డేంజర్ జోన్ సమస్య పరిష్కరించాలి

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న డేంజర్‌జోన్ ఇళ్ల సమస్యను పరిష్కరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు డేంజర్ జోన్ నిర్వాసితులు విన్నవించారు. సోమవారం హైదరబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబును నిర్వాసితులు మార్యాదపూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్హర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సూర్య ప్రకాశ్‌రావు, నిర్వాసితులు ఇందారపు చంద్రయ్య, బొబ్బిలి రాజు, ఆర్ని ఉదయ్, ప్రహ్లాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్ గృహాలు సేకరించాలి

మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ గృహాలను సేకరించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు డేంజర్ జోన్ నిర్వాసితుడు తాండ్ర మల్లేశ్ వినతిపత్రం సమర్పించాడు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. డేంజర్ జోన్‌లోని గృహాలను సేకరించి, నష్ట పరిహారం అందించాలన్నారు. ఈనెల 31లోగా డేంజర్ జోన్‌పై స్పష్టమైన హామీ ఇవ్వకుంటే సెప్టెంబర్ మొదటి వారంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ మేరకు దీక్ష నిర్వహణపై కాటారం డీఎస్పీ, కొయ్యూరు ఎస్సైలకు వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.



శ్రీధర్‌బాబుకు విన్నవిస్తున్న నిర్వాసితులు

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ ముదిరాజులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో పెద్దమ్మ తల్లి గుడి విషయం గురించి వివరించారు. అధికారులతో మాట్లాడి నిర్మాణం కోసం పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు.

మట్టి గణపతులను పూజిద్దాం..



ఎస్ఓకు విత్తన గణపతిని అందిస్తున్న అరుణ్‌రావు

టేకుమట్ల: మట్టి గణపతులను పూజిద్దాం–పర్యావరణాన్ని కాపాడుదామని గ్రీన్ ఇండియా ఇన్‌చార్జ్ అరుణ్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుధాకర్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఎస్ఓ బండి స్వప్నకు మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ రూపొందించిన విత్తన గణపతిని అందించారు. ఈ కార్యక్రమంలో అక్రం, తిరుపతి, కిరణ్ పాల్గొన్నారు.

పెండింగ్ కమీషన్లు చెల్లించాలి



మల్హర్: వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు



టేకుమట్లలో..



కాటారంలో..

మల్హర్/టేకుమట్ల/కాటారం: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్లను వెంటనే చెల్లించాలని డీలర్లు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ మేరకు రేషన్ డీలర్లు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రం అందజేశారు. కమీషన్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో లబ్ధిదారులకు పారదర్శకంగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.

సెప్టెంబర్ 3న కార్మిక పోరాట బహిరంగ సభ



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సెప్టెంబర్ 3వ తేదీన భూపాలపల్లి ఏరియాలో బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మిక పోరాట బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య గౌడ్‌తో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సింగరేణి పరిశ్రమ పరిరక్షణకు కార్మిక హక్కుల సంరక్షణ కోసం దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా భూపాలపల్లిలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈటల రాజేందర్ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, శ్రీధర్, వేణులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు జాతీయ అవార్డు

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌కు అరుదైన గౌరవం దక్కింది. గ్రామీణ ప్రాంతంలో 36 సంవత్సరాలుగా అందిస్తున్న ఉత్తమ విద్యా సేవలను గుర్తించి సర్వేపల్లి రాధకృష్ణన్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎడ్యూటెక్ ఎక్స్ పో–2025 కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత ప్రముఖుల చేతుల మీదుగా ఈ జాతీయ అవార్డును సోమవారం అందుకున్నారు. అనంతరం ఎడ్యుటెక్ ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా విద్యా రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, ఏ1 ఇంటిగ్రేషన్‌పై కార్తీక్‌రావు, కృషిత శిక్షణ తీసుకున్నారు. జాతీయ అవార్డును అందుకోవడంపై ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



జాతీయ అవార్డుతో కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత

బహుజన కులాలకు అండగా ఉంటాం..

భూపాలపల్లి రూరల్: బహుజన కులాల్లో ఏ ఒక్కరికి సమస్య వచ్చిన తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ అండగా ఉంటుందని తీన్మార్ మల్లన్న జేఏసీ జిల్లా ఇన్‌చార్జ్ రవి పటేల్ అన్నారు. భూపాలపల్లి మండలం కమలాపురం గ్రామంలో ఇటీవల ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి గుడిని ధ్వంసం చేసిన వారిపై సోమవారం రవి పటేల్ ముదిరాజ్‌లతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొలిటికల్ జేఏసీ సభ్యులతోపాటు ఇతర కుల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రేగొండ: మండలంలోని రావులపల్లిలో కుమ్మరి సంఘం మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుంపేటి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా చిగురుమామిడి మోహన్, ఉపాధ్యక్షులుగా పోషాలు, మల్లయ్యను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకర్, రమేష్, రాజు, రామన్న, చందర్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: కుమ్మరి సంఘం మండల కమిటీని సోమవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మిసాయి గార్డెన్‌లో మండల ఇన్‌చార్జ్ తాటికంటి శంకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండారపు రఘుపతి, ఉపాధ్యక్షులుగా శనిగరపు శ్రీనివాస్, నాంపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అషాడపు వెంకటేశ్, కోశాధికారిగా ఓదెలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండారపు తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని నవాబుపేట గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన అంకుశ్ అతడి భార్య సలీమా చిట్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన గడ్డం శివకుమార్ పని నిమిత్తం చిట్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో నవాబుపేట మలుపు వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వారిని ప్రైవేటు వాహనంలో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు శివకుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఇద్దరికి గాయాలు

కాటారం: మండలంలోని ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మహదేవపూర్ మండలం బెగులూరు గ్రామానికి చెందిన నగేశ్ కారులో మహదేవపూర్ నుంచి కాటారం వైపుగా వస్తున్నాడు. సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కారు రహదారి పక్కకు దూసుకెళ్లింది. చెట్టు, విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా డ్రైవర్ నగేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అలాగే కాటారం–మహాముత్తారం రహదారిపై పోతుల్వాయి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన గోగు రాజయ్య అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

బుర్రకాయలగూడెం వద్ద రోడ్డు ప్రమాదం..

గణపురం: మండలంలోని బుర్రకాయలగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ములుగు–పరకాల ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విజేందర్ కారులో హనుమకొండకు వెళ్తున్నాడు. బుర్రకాయల గూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న డోజర్ ట్రాక్టర్‌ను కారును ఢీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. కారు బెలున్లు ఓపెన్ కావడంతో వాహనం నడుపుతున్న కార్యదర్శికి పెను ప్రమాదం తప్పింది.

పురస్కారం అందజేత



కమలాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రేగొండ: మండలంలోని ఫొటో గ్రాఫర్స్ సంక్షేమం కోసం చేసిన సేవలకు గాను మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం మండల కోశాధికారి బండి కమలాకర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, కోశాధికారి మాధవరెడ్డి సన్మానించి, పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు రఘుపతి, నాయకులు రాకేష్, సుదర్శన్, స్వామి, సతీష్, సురేందర్ రెడ్డి, వెంకటేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకురావాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: మండలంలోని మైలారం గుట్టల్లో ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రీయల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. మైలారం గుట్టల్లో నిర్వహిస్తున్న ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి పనులను సోమవారం ఆయన అధికారులతో కలసి పరిశీలించి మాట్లాడారు. 60 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఇండస్ట్రీయల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుదారులు ముందుకు రావాలన్నారు. మైలారం రెవెన్యూ శివారులోని 204/1, 205/1 సర్వే నంబర్లలో మొత్తం 187 ఎకరాల భూమి ఉందన్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఈ భూమిని కేటాయించడంతో పాటు ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సహకారంతో పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని టూరిజం, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చి దిద్దుతామని, ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు 60 ఎకరాల్లో 197 ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. స్క్వేర్ ఫీట్ రూ.1600ల చొప్పున త్వరలో టెండర్ కూడా పిలవనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారవేత్తలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రోడ్ల పనులకు ల్యాండ్ లెవలింగ్, రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు ఖర్చు చేశామని మరో రూ.15 కోట్ల నిధుల విడుదలకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ అన్నారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల గణేశ్ నవరాత్రి ఉత్సవ కమిటీలతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి గణేశ్ మండప నిర్వాహకులు పోలీస్ నిబంధనలను పాటించాలన్నారు. పరిమితికి మించి డీజే సౌండ్లు ఉపయోగించరాదని, మండపాల వద్ద విద్యుత్ షాట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, వెంకటేశ్వర్లు, ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్‌కుమార్, పవన్, రాజశేఖర్, గణేశ్ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

పోడు భూములకు పట్టాలివ్వాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి

రేగొండ/చిట్యాల/టేకుమట్ల: మండలంలో సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు అందించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సమస్యలపై బీజేపీ నేతలు రేగొండ, చిట్యాల, టేకుమట్ల తహసీల్దార్లు శ్వేత, షేక్ ఇమామ్‌బాబా, విజయలక్ష్మికి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే కాకుండా అర్హులైన నిరుపేదలకు అందజేయాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ప్రసాదరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండ్యాల రాజు, రవికిరణ్, నాయకులు బుచ్చిరెడ్డి, మల్లేష్, గాలిఫ్, శివకృష్ణ, నరహరి, దేవేందర్, నాగపూరి రాజమౌళి, చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, చెక్క నర్సయ్య, రవీందర్, బట్టల మొగిళి, దుగ్యాల రాంచందర్‌రావు, బండారి సమ్మయ్య, గాజుల అజయ్ పాల్గొన్నారు.



చిట్యాల: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాటారంలో..

కాటారం: మండలంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సోమవారం బీజేపీ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, నాయకులు శ్రీశైలం, మంత్రి సునీల్, గోగుల రాజేశ్, బొంతల రవీందర్, సదానందం,రాజయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- డాక్టర్ సంధ్య

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామి డాక్టర్ సంధ్య అన్నారు. మండలంలోని వేములపల్లిలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సంధ్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లు ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కాటారం: మండలంలోని మేడిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో సోమవారం మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జిల్లా ఎపిడిమిక్ టీం సభ్యులు విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తాగునీటి శాంపిల్స్ సేకరించారు. విద్యార్థులకు వేడి ఆహారం మాత్రమే అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ గీత, జిల్లా ఎపిడిమిక్ టీం సభ్యులు రమేశ్, కాపర్తి రాజు, పరమేశ్వర్, గోపి, సతీశ్, ఏఎస్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కాటారం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రేమ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని..సమస్యలను పట్టించుకోవడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గుజ్జల ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. సాయి, విఘ్నేష్, ప్రదీప్, చారి, వైష్ణవి, మానస పాల్గొన్నార

కాళేశ్వరం: విద్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఏబీవీపీ నగర కార్యదర్శి పేట సాయి ఆరోపించారు. మండలంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పేట సాయి మాట్లాడారు. రాష్ట్రంలో పలు సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందని విమర్శించారు. అడుప సాయి కిరణ్, పేట అజయ్ కుమార్, గోగు విష్ణు, కుమ్మరి రాజేష్ పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291